క్లుప్తంగా

రేపు ఉరుకుందలో లక్ష పుష్పార్చన

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో శుక్రవారం అమావాస్యను పురస్కరించుకుని లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. పుష్పార్చనలో పాల్గొనే భక్తులు (దంపతులకు) రవిక, స్వామి వారి ఫొటో, రెండు లడ్డూలు, దేవాలయం పేరున్న బ్యాగ్‌లో ఉంచి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇందులో పాల్గొనదలిచే దంపతులు ముందుగానే పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఇందుకు గాను రూ.11,116 పూజా రుసుమును చెల్లించాలని సూచించారు.

ఇష్టంతో చదవాలి

ఆదోని సెంట్రల్: ప్రతి విద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అధ్యాపకులు యుగంధర్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని జీఎస్‌ఆర్ పాఠశాల రెండవ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. నేషనల్ పాఠశాల విద్యాసంస్థల అధినేత గోపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముందుగా సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులను సాధించడానికి ప్రణాళిక బద్ధంగా ఎలా చదువుకోవాలో సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సత్య, కో ఆర్డినేటర్ వెంకటేష్, పాఠశాల ఇన్‌చార్జ్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కోసిగి: మండల పరిధిలోని దుద్ది గ్రామానికి చెందిన జొక్కుల నరసప్ప అనే వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. నరసప్ప కర్ణాటక టెట్రా ప్యాకెట్ల మద్యం తాగుడుకు బానిసయ్యాడు. వారం రోజులుగా కడుపు నొప్పి తీవ్రమై మతిస్థిమితం లేకుండా ప్రవర్తించేవాడు. ఈ తరుణంలో బుధవారం ఉదయం ఇంట్లో పురుగు మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే అప్రమత్తమై కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

మతిస్థిమితం లేని మహిళపై అత్యాచారం?

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం అర్ధరాత్రి 12 గంట ప్రాంతంలో మతిస్థిమితం లేని మహిళపై ముగ్గురు వ్యక్తులు అత్యాచారం చేసినట్లు బస్టాండ్ ప్రాంతంలో ప్రజలు చర్చించుకుంటున్నారు. పట్టణానికి చెందిన మతిస్థితిమితం లేని మహిళ రెండు నెలలుగా ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలోనే రాత్రి పూట ఉంటోంది. మంగళవారం అర్ధరాత్రి 12 గంట ప్రాంతంలో ముగ్గురు వ్యక్తులు మద్యం సేవించి.. మతిస్థిమితం లేని మహిళకూ మద్యం తాపించి బస్టాండ్ ముందు ఖాళీగా ఉన్న సైకిల్ స్టాండ్‌లో అవరణలోకి తీసుకెళ్లి అత్యాచారం జరిపినట్లు తెలుస్తోంది. ఈ సంఘటన చూసిన వ్యక్తి కూడ అత్యాచారయత్నం చేసినట్లు సమాచారం. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో సీసీ కెమెరాలను పరిశీలిస్తే అత్యాచారానికి పాల్పడిన వ్యక్తులను గుర్తించవచ్చునని ఆర్టీసీ ఉద్యోగులు చెబుతున్నారు. బస్టాండ్‌లో నుంచి ఆ మహిళను బయటకు వెళ్లమంటే వెళ్లటం లేదని, ఆమెకు సంబంధించిన వారికి సమాచారం అందించిన వారు కూడా పట్టించుకోవడం ఆర్టీసి సిబ్బంది తెలిపారు.

తిరుమల నగర్‌లో చోరీ

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని తిరుమల నగర్‌లో ఓ ఇంట్లో బంగారు ఆభరణాలు, నగదు చోరీకి గురయ్యాయి. సోగనూరు గ్రామానికి చెందిన బాలకృష్ణారెడ్డి పట్టణంలో ఫర్టిలైజర్ దుకాణం నిర్వహిస్తూ తిరుమల నగర్‌లో నివాసముంటున్నాడు. శివరాత్రిని పురస్కరించుకొని మంగళవారం కుటుంబ సభ్యులతో శ్రీశైలానికి వెళ్లారు. ఇంట్లో ఎవరు లేని విషయం గుర్తించిన దొంగలు రాత్రి ఇంటి తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించి, బీరువా తాళం ధ్వంసం చేసి చోరీకికి పాల్పపడ్డారు. బుధవారం ఉదయం ఇంటి పక్కల వారు ఇంటి తాళం పగలగొట్టడాన్ని గమనించి విషయాన్ని శ్రీశైలంలో ఉన్న బాలకృష్ణారెడ్డికి సమాచారం అందించారు. పట్టణ పోలీసులకు సమాచారం అందించటంతో సాయంత్రం క్లూస్ టీం పోలీసులు వచ్చి ఇంట్లో చోరీ జరిగిన చోట వేలిముద్రలు సేకరించారు. ఇంట్లో ఉన్న ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ. 40 వేల నగదు చోరీకి గురైనట్లు బాధితుడు బాలకృష్ణారెడ్డి తెలిపారు. పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు విచారిస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

హాలహర్వి: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వీఆర్‌పీఎస్ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, మండల కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తామని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబునాయుడు, ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను విస్మరించారని మండిపడ్డారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ మార్చి 3న కర్నూలు కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కృష్ణమూర్తి, రంగయ్య పాల్గొన్నారు.




తుంగభద్ర నది తీరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు, సైకత లింగాలకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు



భక్తులకు అన్నదానం చేస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ దంపతులు

ఓం నమఃశివాయ

- వైభవంగా మహాశివరాత్రి వేడుకలు
- గురజాల రామలింగేశ్వరుడి క్షేత్రంలో భక్తుల కిటకిట
- పాదయాత్ర భక్తులతో దారులు కళకళ
- తుంగాతీరం భక్త జనసంద్రం

నందవరం : మహాశివరాత్రి వేడుకలను భక్తులు వైభవంగా జరుపుకున్నారు. బుధవారం దక్షిణ కాశీగా పేరుగాంచిన గురజాల రామలింగేశ్వరుడి క్షేత్రంలో శివరాత్రి వేడుకలు దేదీప్యమానంగా సాగాయి. క్షేత్రం శివనామస్మరణతో మార్మోగింది. శ్రీరాముడి అమృత హస్తాలతో ప్రతిష్ఠించిన శివలింగ దర్శనర్థమై భక్త జనం పోటెత్తింది. భక్తజన కోలాహలంతో తుంగభద్రనది తీరం కళకళలాడింది. అలయ ఈఓ రాంప్రసాద్ ఆధ్వర్యంలో పురోహితులు హంపేష్ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున ధ్వజారోహణ, మహాసంప్రోక్షణ, కలశ పూజతో ఉత్సవాలకు అంకుర్పాణ పలికారు. బిల్వార్చన, రుద్రాభిషేకం, నమకచమక పూజలు గావించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కర్ణాటక, తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రల నుంచి వేలాదిగా భక్తులు వచ్చి స్వామి సేవలో తరించారు. సాయంత్రం జాగరణ సందర్భంగా రాత్రి నటరాజ కళాక్షేత్రం ఎమ్మిగనూరు బృందంతో కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలు చేపట్టారు.




స్వామి దర్శనానికి క్యూలైన్లలో పోటెతిన భక్త జనం, రామలింగేశ్వర స్వామికి అభిషేకాలు చేస్తున్న భక్తులు

స్వామి సన్నిధిలో ప్రముఖులు

శివరాత్రి సందర్భంగా పలువురు ప్రముఖులు గురజాల క్షేత్రానికి విచ్చేశారు. ఆదోని డివిజన్ సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ దంపతులు, ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడి, డీఎస్పీ ఉపేంద్రబాబు, సీఐలు మధుసుదన్‌రావు, శ్రీనివాసులు, నందవరం తహసీల్దార్ శ్రీనివాసులు, కౌతాళం తహసీల్దార్(ఎఫ్‌ఏసీ) రజనీకాంత్‌రెడ్డి తదితరులు రామలింగేశ్వర స్వామికి అభిషేకాలు, విశిష్ట పూజలు గావించారు. అనంతరం సబ్ కలెక్టర్ దంపతులు అన్నదాన కార్యక్రమంలో భక్తులకు అన్నం వడ్డించారు. కార్యక్రమంలో ఆదోని డివిజన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ వీరస్వామి, గ్రామ పెద్దలు శివారెడ్డి, రాజేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహారెడ్డి, పరమేష్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రామలింగేశ్వరుడి మహారథోత్సవం

గురజాల రామలింగేశ్వర స్వామి మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం మహారథోత్సవం జరగనుంది. ఆలయ ఈఓ రాంప్రసాద్ ఆధ్వర్యంలో రథయాత్ర అన్ని ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 5 గంటలకు ఉత్సవ మూర్తులు పార్వతి పరమేశ్వర్లను రథంపై కొలువుంచి నంది మంటపం వరకు రథాన్ని ఊరేగిస్తారు.



ఎమ్మిగనూరు తేరుబజారులోని మార్కండేయస్వామి ఆలయం వద్ద పదివేల దీపోత్సవంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



హెచ్. కైరవాడిలో శివుని చిత్రపటంతో ఊరేగింపు చేస్తున్న గ్రామస్తులు

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని తేరుబజారులోని మార్కండేయస్వామి ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారికి పూజలు చేశారు. రాత్రి ఆలయ ఆవరణలో పదివేల దీపోత్సవంలో మహిళలు పాల్గొని దీపాలు వెలిగించి భక్తిభావాన్ని చాటారు. అదేవిధంగా తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని దత్తసాయి ఆలయం, కోటాఈశ్వరస్వామి దేవాలయంతో పాటు పట్టణంలోని పలు దేవాలయాల్లో భక్తులు పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా రాత్రి స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వీరశైవలింగాయత్ విభాగం అధ్యక్షుడు రుద్రగౌడ్, పద్మశాలి సంఘ అధ్యక్షుడు విశ్వనాథ్‌రమేష్, టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బీఎస్ నాగరాజు, రఘు తదితరులు మార్కండేయస్వామి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎమ్మిగనూరురూరల్: మండలంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని గుడేకల్ భ్రమరాంబా మల్లికార్జున స్వామి, పార్లపల్లి, పెసలదిన్నె శ్రీ మోక్షలింగేశ్వరస్వామిలతో పాటు అన్ని గ్రామాల్లోని శివాలయాల్లో బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం వరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. గుడేకల్, సోగనూరు, కోటేకల్, కందనాతి, కడిమెట్ల, రాళ్లదొడ్డి, పెసలదిన్నె, పార్లపల్లి, ఎర్రకోట పూజలతో పాటు గ్రామాల్లో స్వామి వార్లకు కల్యాణం ఉంటుందని ఆయా దేవాలయాల పూజాలు తెలిపారు. పెసలదిన్నె గురువారం సాయంత్రం రథోత్సవం ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్లతో పాటు గంజహళ్లి, పుట్టపాశం, అలువాల, గాజులదిన్నె, వీరంపల్లి, ఎర్రబాడు, అగ్రహారం, బైలుప్పల, హెచ్ కైరవాడి, వేముగోడు, కులుమాల, పెద్దమరివీడు, తిప్పనూరు తదితర గ్రామాలలో బుధవారం మహాశివరాత్రి పండుగ వేడుకలు వైభవంగా జరిగాయి. గోనెగండ్లలో ఈశ్వరుని దేవాలయంలో వీరశైవమఠం పీఠాధిపతి శివయ్య స్వామి, నీలకంఠేశ్వర స్వామి దేవాలయంలో యాగమంటప ప్రవేశం, గణపతి పూజ, కలశస్థాపన, అంకురార్పణం, శత రుద్రాభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ, మహామంగళహారతి ఇచ్చారు. సాయంత్రం ఈశ్వర దేవాలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం జరిపించారు. అలాగే హెచ్ కైరవాడి గ్రామంలో సాయంత్రం శివుని చిత్రపటంతో గ్రామస్తులు శివాలయం దేవాలయం నుంచి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.



గోనెగండ్ల ఈశ్వర దేవాలయంలో పూజలు చేస్తున్న వీరశైవ మఠం పీఠాధిపతి శివయ్య స్వామి

వైభవంగా కలశ ప్రతిష్టాపన



నూతన కలశానికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో పరమేశ్వరుడు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని మహా శివరాత్రి వేడకలను ఆదివారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. బుధవారం శాంత మల్లప్ప కొండలో వెలసిన శాంత మల్లేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా కలశానికి కుంభాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్ఠించారు. చిన్మయ మిషన్ వారి ఆధ్వర్యంలో బ్రహ్మచారి నారాయణ చైతన్య, పురోహితులు రాజశర్మ వారి నిర్దేశకత్వంలో నూతన కలశం ప్రతిష్టాపనకు ప్రత్యేక హోమం నెల రోజులు పాటు నిర్వహించారు. హోమానికి శుక్రవారం పూర్ణాహుతి గావించనున్నారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివలింగానికి విశిష్ట పంచామృతం, ఆకుపూజ, నర్మద జలాలతో ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయం అధ్యక్షులు ప్రతాప్, కార్యదర్శి రఘునాథ్, కోశాధికారి రమేష్ పెద్దలు విట్టా రమేష్, మోహన్ రెడ్డి, విట్టా మురళి జగదీష్, ఇల్లూరు శ్రీనివాస్, బాదమి శ్రీనివాస్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఆంజినేయస్వామి ఉత్సవాలు ప్రారంభం

కౌతాళం: మండల పరిధిలోని ఎరిగేరి గ్రామంలో వెలసిన పులిగట్టు ఆంజినేయస్వామి ఉత్సవాలు శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం ప్రారంభమయ్యాయి. శివరాత్రి రోజు రాత్రి స్వామి పల్లకీని దేవుని కట్ట నుంచి రాత్రి కొండపైకి తీసుకెళ్లే కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. రాత్రంతా అక్కడ జాగరణ చేసి భజనలు, వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం ఉదయం భక్తులు తలనీలాలు సమర్పిస్తారని, స్వామికి పిండి వంటలు వండి నైవేద్యం సమర్పించి నిష్ఠతో పూజలు చేస్తారని నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం స్వామి పల్లకీ మహోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వారు తెలిపారు.



కొండపైకి తరలించేందుకు కట్టవద్ద స్వామి వారిని సిద్ధం చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు



కౌతాళంలో పూజలందుకుంటున్న త్రైంభకేశ్వరస్వామి



మేళిగనూరులో ప్రత్యేకాలంకరణలో రామలింగేశ్వరస్వామి

కౌతాళం: మండలంలోని ప్రముఖ ఆలయాల్లో బుధవారం శివరాత్రి సందర్భంగా భక్తుల సందడి కొనసాగినది. మండల పరిధిలోని నదిచాగి మజర గ్రామమైన మేళిగనూరు వద్ద తుంభద్రనది తీరాన స్వయాన శ్రీరాముడు ప్రతిష్ఠించిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఉదయం నుంచి భక్తుల రద్దీ కొనసాగినది. తుంగభద్ర నది వద్ద పుణ్యస్నానాలు ఆచారించి అభిషేక పూజలు నిర్వహించారు. అలాగే మండల పరిధిలోని ఎరిగేరిలోని పులిగట్టు అంజనేయస్వామి దేవాలయం, బసవేశ్వర స్వామి ఆలయం, బదినేహాల్ మల్లికార్జునస్వామి ఆలయం, రౌడూరు జట్టెప్పతాత ఆలయాలలో ప్రత్యేక పూజలను చేపట్టారు. కౌతాళంలో వెలసిన త్రైంభకేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజల కోసం భక్తులు బారులుతీరారు. రాత్రి ఆయా ఆలయాల్లో పురాణ ప్రవచనాలతో జాగారణ చేపట్టారు.


కనుల పండువగా శివపార్వతుల కల్యాణం

పెద్దకడబూరు : మహా శివరాత్రిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని మల్లికార్జునస్వామి ఆలయంలో బుధవారం రాత్రి శివపార్వతుల కల్యాణం కనుల పండువగా సాగింది. మండలంలోని చిన్నతుంబళం రామలింగేశ్వరస్వామి, బాపురం గంగాభవానిమాత, పెద్దకడబూరులోని సిద్ధారూఢస్వామి, దొడ్డిమేకల గ్రామంలో చంద్రమౌళేశ్వరస్వామి, హెచ్.మురవణి గ్రామంలో ఉమా మహేశ్వరస్వామి ఆలయాల్లో బుధవారం తెల్లవారు జామునుంచి ఆయా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామ ప్రజలు శివయ్యకు అత్యంత ప్రీతికరమైన బెల్లం పానకం, గుగ్గిళ్లను నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం మండల కేంద్రంలో వెలసిన సిద్ధారూఢస్వామి వారి ప్రభోత్సవం అత్యంత రమణీయంగా నిర్వహించారు. ప్రభను స్థానిక పెద్దబావి దగ్గరకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి యథాస్థానానికి చేర్చారు.

నేడు రథోత్సవాలు

మండలంలోని దొడ్డిమేకల గ్రామంలో వెలసిన చంద్రమౌళేశ్వరస్వామి రథోత్సవం, హెచ్.మురవణి గ్రామంలో వెలసిన ఉమా మహేశ్వరస్వామి రథోత్సవం గురువారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయా గ్రామాల పెద్దలు, అర్చకులు తెలిపారు.

కోసిగి: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కోసిగిలోని ఈశ్వర దేవాలయం నాగరాజు స్వామి, మార్కండేయ స్వామి దేవాలయంలో వీరేష్ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి జలాభిషేకం, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, ఫల, పుష్పాలంకరణలు గావించి మహా మంగళ హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు ఉదయం నుంచి ఉపవాస దీక్షలు చేపట్టి సాయంత్రం స్వామి వారికి గుగ్గిళ్ల, పళ్లు, పూలు, నారికేలాలు సమర్పించి పూజలు చేసుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే మండలంలోని కందుకూరు గ్రామంలో తుంగభద్ర నది ఒడ్డున వెలసిన త్రేతాయుగంలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు.



కోసిగి మార్కండేయ స్వామికి హారతులు ఇస్తున్న అర్చకులు వీరేష్ స్వామి



పెద్దకడబూరులో ప్రభోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వాటర్‌షెడ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మొక్కలను నీళ్లు పోస్తున్న వాటర్‌షెడ్ ఏఎస్‌పీఎస్ మాధవీలత, పీఓ వలిబేగ్

ఎమ్మిగనూరురూరల్: గ్రామీణ ప్రాంత ప్రజలు వాటర్‌షెడ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వాటర్‌షెడ్ అడిషన్ ప్రాజెక్ట్ అధికారిణి మాధవీలత అన్నారు. బుధవారం వాటర్‌షెడ్ పీఓ వలిబేగ్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కందనాతి గ్రామంలో ఒక్క రోజు వాటర్‌షెడ్ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వారు మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే వాటర్‌షెడ్ చెక్‌డ్యాంలు, ఇతర పనులను రైతులు ఉపయోగించుకోవాలని సూచించారు. నీటి కుంటల ఏర్పాటు వలన భూమిలో నీటిశాతం పెరుగుతుందన్నారు. బోర్లలో నీటి లభ్యత కూడా పెరుగుతుందని తెలిపారు. తద్వారా సాగు, తాగునీటికి ఇబ్బందులుండని చెప్పారు. ఫారం పాండ్స్, రైతులు పొలాల్లో చెక్‌డ్యాంలు ఏర్పాటు చేయటంతో పాటు ఇంజిన్లు, తార్పాలిన్లు, తైవాన్ పంపులు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో అధికారులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలకు 'సాధన'

- టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- ఉదయం, సాయంత్రం సబ్జెక్టుల వారీగా బోధన
- వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయుల కృషి

గోనెగండ్ల: పదో తరగతి పరీక్షలు అనగానే విద్యార్థుల్లో హడావుడి, మానసిక ఒత్తిడి సాధారణం. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ఒకింత పరీక్షే. పదవ తరగతి పరీక్షలు మార్చి 17 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్షకు హాజరైన ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తున్నారు. దీనికి అనుగుణంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సన్నద్ధం అవుతున్నారు. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులకు మెలకువలు నేర్పుతున్నారు. ఈ సంవత్సరం పదిలో 100శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ప్రత్యేక ప్రణాళికతో ముందుకు..

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 17 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్తమ ఫలితాల సాధన కోసం విద్యార్థులు తమవంతు ప్రయత్నం చేస్తున్నా. వారిలో కొంతభయం, ఆందోళన ఉండడం సహజం. ఒత్తిడిని అధిగమించేలా ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రత్యేకంగా పాఠాలు బోధిస్తున్నారు. మండలంలో 7 హైస్కూళ్లు, వీటితో పాటు ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలు ఉన్నాయి. మొత్తం ఆయా పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులు 640 మంది ఉన్నారు. వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని అధికారులు తెలుపుతున్నారు.



గోనెగండ్ల హైస్కూల్‌లో పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు


అర్థమయ్యే రీతిలో బోధన



పబ్లిక్ పరీక్షలంటే భయం ఉంటుంది. పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండడంతో పరీక్షలపై ఆత్మ విశ్వాసం పెరుగుతోంది. ఇప్పటికే చదివిన అంశాలు రివిజన్ చేసుకుంటున్నాం. పరీక్షలంటే భయం పోయింది. ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా చదవడానికి అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

– వి. నందిని, పదోతరగతి, జెడ్పీహెచ్‌ఎస్, గోనెగండ్ల


మానసిక ఒత్తిడి లేకుండా చూస్తున్నారు



ప్రతి రోజు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నటికీ మాకు మానసిక ఒత్తిడి లేకుండా ఉండేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ప్రతి సబ్జెక్టు అర్థమయ్యే రీతిలో బోధిస్తున్నారు. మంచి మార్కులతో పాస్ అవుతాను.

– ఎం. ఫయాజ్, పదోతరగతి, జెడ్పీహెచ్‌ఎస్, గోనెగండ్ల

కొంచెం కష్టపడితే సులువే



గణితం అంటే విద్యార్థులు భయపడడం సహజం. కొంచెం కష్టపడితే మంచి మార్కులు సాధించడం చాలా సులువు. విద్యార్థుల్లో భయం పోగొట్టిందుకు ఉదయం, సాయంత్రం వెళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాము. విద్యార్థులు చదివిన ప్రతి అంశాన్ని సాధన చేయాలి. సందేహాలుంటే ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలి.

– ఉస్మాన్, గణితం ఉపాధ్యాయుడు, గోనెగండ్ల

వందశాతం ఉత్తీర్ణత సాధిస్తాం



విద్యార్థులు పాఠ్యాంశాలపై పట్టు సాధించాలి. మారిన పరీక్ష విధానానికి అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు ఇప్పటికే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది పదవ తరగతి పరీక్షల్లో గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి వందశాతం ఉత్తీర్ణత సాధిస్తాం. అందుకు తగ్గట్టుగా బోధన చేస్తున్నాం.

– నాగభూషణం, హెచ్‌ఎం, గోనెగండ్ల